క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

ఐఎస్ఐ మార్క్ వస్తువులే వినియోగించాలి



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రామభద్రపురం: వంట గదిలో అదనపు సిలిండర్లు, మండే వస్తువులు ఉంచరాదని, ఐఎస్ఐ మార్క్ కలిగిన వస్తువులను మాత్రమే వినియోగించాలని బాడంగి అగ్నిమాపక శాఖాధికారి రామసూర్యారావు తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించి, మాక్‌డ్రిల్ శుక్రవారం నిర్వహించారు. మంటలు చెలరేగితే సిబ్బంది తమను తాము ఎలా రక్షించుకోవాలో, ప్రమాద తీవ్రతను ఎలా తగ్గించుకోవాలోనన్న అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు.

పంటలు బాగా పండాలని పూజలు



దాడితల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

బొబ్బిలి: పంటలు బాగా పండాలని స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన చేసి, ప్రజలను వ్యాధుల నుంచి దూరంగా ఉంచాలని, అలాగే ప్రతి రైతు వేసిన పంట అధిక దిగుబడులను ఇచ్చేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. మే నెలలో జరిగే అమ్మవారి సిరిమానోత్సవం రోజున పూజలో వినియోగించిన గాజులను భక్తులకు అందజేస్తామని అర్చకులు తెలిపారు.

వస్త్రదానం



దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణదాసు మాస్టారు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో రైల్వే లైను పనుల నిమిత్తం జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల పిల్లలకు వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు శుక్రవారం వస్త్రదానం చేశారు. ఆయన తన సొంత డబ్బులతో పిల్లలకు సరిపడ దుస్తులు, పౌష్టికాహారం అందజేశారు. ఈ మేరకు పిల్లల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏడీఈ ఫణీంద్రకుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్తంభాలు మారుస్తున్న నేపథ్యంలో మారుతీనగర్, డోలపేట, పొనుగుటివలస, విద్యానగర్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



పెట్రోల్ బంకు వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

రాజాం సిటీ: అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలు నివారించవచ్చని ఫైర్ ఎస్ఐ టీఎస్ఎస్ జనార్దనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బొబ్బిలి రోడ్డులోని గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంకుల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించి, ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

క్రీస్తు ప్రాణత్యాగం.. మానవాళికి నిత్యజీవం!



సంతకవిటి: జీఎన్‌పురం రేమా బ్లెస్సింగ్ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు



తెర్లాం: కూనాయవలసలో క్రీస్తు ప్రార్థనా మందిరంలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు



బొబ్బిలి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



వంగర: ఏసుక్రీస్తు వేషధారణలో శిలువ మోస్తున్న దృశ్యం



తెర్లాంలో యేసుక్రీస్తు కలువరి సిలువ మోయడాన్ని ప్రదర్శిస్తున్న ఆర్‌సీఎం చర్చి విశ్వాసులు

వాడవాడలా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. జీసస్ శిలువ మరణం పొందిన రోజును పురస్కరించుకుని, ఏటా ఈ కార్యక్రమం చేపడతారు. ప్రజల పాప పరిహారానికి ఏసుప్రభువు శిలువపై తనను తాను త్యాగం చేసుకున్నారని, ఆయన ప్రాణత్యాగమే సర్వమానవాళికి నిత్యజీవం ప్రసాదించిందని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసం ఆచరిస్తూ క్రీస్తు మరణం, శ్రమదినాలలో ఆయన పడిన ఇబ్బందులు గుర్తు చేసుకుని, ప్రత్యేక ఆరాధనలు చేశారు. దేవుడెన్నడూ బలిని కోరుకోడని, తనకు తానుగా ప్రజల కోసం బలి ఇచ్చుకున్నవాడే నిజమైన దేవుడని, ఆయనే ఏసుక్రీస్తు అని ఫాదర్‌లు తెలిపారు. ఇరుగుపొరుగు వారిని ప్రేమించి, వారి తప్పులను మంచి మనసుతో క్షమించాలన్న జీసస్ బోధనలను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఏసుప్రభువు మరణ వృత్తాంతం తెలిపే నాటక ప్రదర్శనలు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించాయి.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బొబ్బిలిరూరల్: అలజంగిలో ఏసుక్రీస్తు వేషధారణలో శిలువ మోస్తున్న భక్తుడు



రామభద్రపురంలోని సెయింట్ లూథరన్ చర్చిలో దైవ సందేశం వినిపిస్తున్న పాస్టర్



రేగిడి: అంబఖండి చర్చిలో ప్రార్థనల్లో మతవిశ్వాసకులు



బాడంగి: కోడూరులో శిలువ వేయబడిన క్రీస్తు విగ్రహాన్ని పట్టుకుని ఊరేగుతున్న ఫాదర్ యుగల్‌కుమార్, క్రైస్తవులు



బాడంగి: ముగడలో ఏసుప్రభువు మరణ వృత్తాంత నాటకం వేషధారణలు



బొబ్బిలి: ఏసుప్రభువు శిలువ మోసే సంఘటనను రిక్రియేషన్ చేస్తున్న మతవిశ్వాసులు

బీసీ కులగణన ఎప్పుడు చేస్తారు?

రేగిడి: ఎన్నికల సమయంలో చట్టబద్ధంగా బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ ఎప్పుడు అమలు చేస్తారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, కింజరాపు సురేష్‌కుమార్‌లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. స్థానికసంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామనే హామీ కూడా బుట్టదాఖలైందని విమర్శించారు. అలాగే నియోజకవర్గానికి ఒక బీసీ భవనం, బీసీల స్వయం ఉపాధికి ఏడాదికి వంద కోట్ల రూపాయల కేటాయింపు వంటి హామీలు గాలిలో కలిసిపోయాయన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, హామీలు అమలు చేయకుంటే వారే సమయం చూసి తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

బొబ్బిలి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ చింతా అప్పారావు మాస్టారు ఆకాంక్షించారు. స్థానిక శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శుక్రవారం సన్మానించి, అభినందించారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తి కనబరిచి, ఉన్నత చదువులు చదవాలని ఆశీర్వదించారు. గత 28 ఏళ్లుగా తమ కళాశాల సత్తాచాటుతూ అత్యుత్తమంగా విద్యార్థులను తీర్చిదిద్దుతోందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ అప్పారావు మాస్టారు

సత్కారం పొందిన విద్యార్థుల్లో పి.ఇంద్రాణి, వి.తనూజ, వి.పూజిత, పి.సింధుజ, జి.గీతామాధురి, బి.అక్షయలు ఉన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొత్స వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.307

రాజాం సిటీ: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.307 వేతనం లభిస్తుందని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కంచరాం పైలవాని చెరువులో చేపడుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండు పూటలా ఉదయం, సాయంత్రం చల్లని వేళల్లో పనులు చేయాలన్నారు. అలాగే పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని వావిలవలస, ఉంగరాడ, అంబఖండి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాథరావు శుక్రవారం పరిశీలించారు.



రాజాం సిటీ: వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నేలకూలిన చెట్లు



పిట్టాడ వద్ద రోడ్డుపై కూలిన తాటిచెట్టు

మెంటాడ: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి ఆంధ్ర వెళ్లే దారిలోని కొన్ని తాటిచెట్లు నేలకూలాయి. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే దారిలో రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్లు కూలి ఇద్దరు కూలీలు మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం కూలిన చెట్లు కూడా ఓ పెళ్లి వ్యాన్‌పై పడాల్సింది కానీ అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న చెట్లు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



రాజాం: చెట్టు సగభాగం కూలిన దృశ్యం

రాజాం: మండలంలోని కొత్తపేట సమీపంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఓ భారీవృక్షం సగభాగం రోడ్డుపై విరిగి పడిపోగా, మిగతా భాగం ప్రమాదకరంగా ఒరిగి ఉంది. దీంతో అటువైపుగా వెళ్తున్న వారు ఆ ఒరిగి ఉన్న చెట్టు సగభాగం ఎప్పుడు ఎవరిపై పడిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

• పనిభారం తగ్గించండి



పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు రాజాం మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ నగరపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రాజాం రూపాంతరం చెంది 20 ఏళ్లు గడుస్తున్నా కార్మికుల సంఖ్య పెరగలేదన్నారు. దీంతో ఉన్న కార్మికులపై పనిభారం పడిందన్నారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మి, కె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

– రాజాం సిటీ

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వేణుగోపాలనాయుడు

బొబ్బిలిరూరల్: మండలంలోని నారసింహునిపేటలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గంట వెంకటనాయుడు కుటుంబ సభ్యులను పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం కలిసి పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట నాయకులు ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ప్రారంభం

బొబ్బిలి: స్థానిక పూల్‌భాగ్‌లో ఏపీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగులకు అందిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ తెలిపారు.

సక్రమంగా ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణ

రాజాం: సక్రమంగా ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వేస్ట్ ప్రాసెస్ సెంటర్/చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)లను నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు క్లాప్‌మిత్రలకు సూచించారు. మండలంలోని ఎంజేవలస, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద తయారు చేసిన సేంద్రియ ఎరువులను రైతులకు సబ్సిడీపై అందించి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

రేగిడి: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం విభాగం ఎంటీ పద్మ, ఎల్2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీ తవిటినాయుడు తెలిపారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఖరీఫ్ సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు జల్లుకుని, మొక్కలైన 45 రోజుల తర్వాత వాటిని అదే నేలలో కలియదున్నితే నేల సారవంతం అవుతుందన్నారు. తద్వారా పంటలు బాగా పండుతాయన్నారు.

నిజాలను అంగీకరించే ధైర్యం ప్రభుత్వానికి లేదు..

• వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



రాజాం సిటీ: గోమాతల మరణాలపై నిజాలను అంగీకరించే ధైర్యం కూటమి ప్రభుత్వానికి లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గోవుల మరణాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని కూటమి నేతలు చర్చకు పిలిచి, హౌస్ అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఇదేనా బహిరంగ చర్చ నిర్వహించే తీరని ధ్వజమెత్తారు. కళ్ల ముందు అన్ని ఆధారాలు కనిపిస్తున్నా సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు, మంత్రి లోకేష్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోమాతల మరణాలపై బహిరంగ చర్చకు, వాస్తవాలను ఆధారాలతో బయటపెట్టేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని ప్రభుత్వం సిద్ధమా అని సవాలు విసిరారు. తిరుమలలో జరుగుతున్న వరుస ఘటనలు శ్రీవారి భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. వారి తప్పులు కప్పిపుచ్చుకోవడానికి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో హిందూ ధర్మాన్ని రక్షిస్తాననే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు టీటీడీలోని గోమాతల మరణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దీనిపై స్పందించే తీరిక కూడా ఆయనకు లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా గోవుల మరణాలకు గల కారణాలు తెలుసుకుని, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలని హితవు పలికారు.

• అర్హులకే రుణాలు ఇవ్వండి



ఎస్సీ కార్పొరేషన్ రుణాలనైనా అర్హులకే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు పెంకి భీమయ్య, వైస్ ఎంపీపీ పెంకి అరుణ కోరారు. ఇదే విషయమై వారు రామభద్రపురం మండలం, ఆరికతోటలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో కూటమి నేతల ఆదేశాలకు అధికారులు తలొగ్గి అర్హులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇప్పుడలా కాకుండా సక్రమంగా ఇంటర్వ్యూలు చేసి అర్హులను గుర్తించాలన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందేవన్నారు. అలాగే ఇప్పుడు కూడా అందివ్వాలన్నారు. సమావేశంలో సర్పంచ్ పెంకి పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

–రామభద్రపురం

• సమ్మెను విజయవంతం చేయండి



కార్మికుల హక్కులు హరించేలా కనీస వేతన చట్టం రద్దుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. బొబ్బిలిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ మంటపం వద్ద శుక్రవారం జరిగిన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా కేంద్రం చేస్తున్న చట్టాలు, జీవోలను ప్రపంచానికి తెలియజేయాలన్నారు. కనీస వేతన చట్టం రద్దయితే ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్‌లు, సెలవులు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనిపై పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పీ4 సర్వే కూడా అంతా బూటకమేనని విమర్శించారు.

– బొబ్బిలి

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీపై హర్షం

రాజాం: ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేయడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు యందవ నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే ఎస్సీల్లోని 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. 30 ఏళ్లకు ఎమ్మార్పీఎస్ పోరాటం ఫలించిందన్నారు.

పకడ్బందీగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

బాడంగి: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. శనివారం చేపట్టనున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. పక్కాగా కార్యక్రమం చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కృషి చేయాలని తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన

వంగర: సాంకేతిక విద్యతో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువని ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బాబూరావు తెలిపారు. స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సులపై శుక్రవారం అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందించారు.